సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 1 । ఆగస్టు । 2023



పత్తి క్వింటాల్‌కు రూ.6,987

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు రూ.6,987 పలికింది. కనిష్టంగా రూ.6,006, సరాసరి రూ.6,867గా నమోదైనట్లు ప్రత్యేకశ్రేణి కార్యదర్శి తెలిపారు.



విజృంభిస్తున్న 'కళ్ల కలక'

కళ్ల కలక(కంజెక్టివిటీస్) వ్యాధి విజృంభిస్తోంది. వర్షాలు తగ్గిన తర్వాత సీజనల్ వ్యాధులతోపాటు దీని ప్రభావం కూడా ఎక్కువగా కనిపిస్తోంది. 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని కొన్నిప్రాంతాల్లో చిరుజల్లులు, మరికొన్నిచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పార్లమెంట్‌లో ఎంపీ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న వెంకటేశ్‌నేత

పెద్దపల్లిరూరల్: మణిపూర్‌లో జరిగిన హింసాకాండపై బీఆర్‌ఎస్ ఎంపీలు చర్చకు పట్టుబట్టారు. పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టి నిరసన వ్యక్తం చేశారు.

ఎన్టీపీసీలో 6,040 మి.యూ విద్యుత్ ఉత్పత్తి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు జూలైలో 6,040 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసింది. 78.52 శాతం పీఎల్ఎఫ్ (ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్)తో పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. 200 మెగావాట్ల మొదటి యూనిట్‌లో 114, రెండో యూనిట్‌లో 124, మూడో యూనిట్‌లో 108, నాలుగో యూనిట్‌లో 287, ఐదో యూనిట్‌లో 252, ఆరో యూనిట్‌లో 263, ఏడో యూనిట్‌లో 325 మొత్తంగా 2600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులో ప్రస్తుతం 1540 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతున్నట్లు పేర్కొన్నారు.

కలెక్టరేట్ ఎదుట పారిశుధ్య కార్మికుల నిరసన

పెద్దపల్లిరూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసనకు దిగారు. వీరికి బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష, సీపీఎం జిల్లా కార్యదర్శి ముత్యంరావు మద్దతు తెలిపారు. వ్యవసాయ మార్కెట్ నుంచి ప్రదర్శనగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు చంద్రశేఖర్, స్వప్న, వెంకటేశ్, రాజనర్సయ్య, శేషాద్రి, రవి, దుర్గయ్య, గోపాల్, ఎండీ.ఖాజా, తిరుపతి, నరేశ్, అశోక్, లచ్చయ్య, పురుషోత్తం, సంపత్, రాజయ్య, ముస్తఫా, మహేశ్, ఆనంద్, రాజ్‌కుమార్ తదితరులున్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి



టైలరింగ్ శిక్షణ సర్టిఫికెట్లు అందిస్తున్న రాజ్‌ఠాకూర్

గోదావరిఖని/కోల్‌సిటీ: స్వయం ఉపాధి మార్గాల ద్వారా మహిళలు ఉన్నత స్థాయికి ఎదగాలని డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు సోమవారం ఆయన సర్టిఫికెట్లు అందించారు. ఒకప్పుడు వంటింటికి పరిమితమైన మహిళలు స్వయం ఉపాధిలో రాణిస్తూ కుటుంబాలకు బాసటగా నిలుస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ కార్పొరేటర్ సనాఫక్రుద్దీన్ పదేళ్లుగా అనేక సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతున్నారని అభినందించారు. నియోజకవర్గంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారిందన్నారు. ఉద్యోగాలు లేక యువత ఇబ్బంది పడుతోందని, ఉద్యోగాల పేరుతో ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అనుచరులు దండుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మానేరులో కొట్టుకుపోయిన చెక్‌డ్యాం



రూపునారాయణపేట వద్ద చెక్‌డ్యాం పరిస్థితి

ఓదెల: భూగర్భజలాలు పెంచేందుకు ప్రభుత్వం మండలంలోని రూపునారాయణపేట వద్ద మానేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం భారీ వరద రావడంతో కొట్టుకుపోయింది. ఎగువ నుంచి వస్తున్న వరదకు తోడు లోయర్ మానేరు డ్యాం గేట్లు తెరవడంతో ప్రవాహం ఉధృతి పెరిగి చెక్‌డ్యాం కిలోమీటర్ వరకు కొట్టుకుపోయింది. కిందినుంచి బలమైన కట్టడాలు లేకుండా.. పైన దిమ్మెలు ఏర్పాటు చేయడంతోనే ఈ దుస్థితి వచ్చిందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పనులు పూర్తయి నెల తిరగకముందే ఇలా కొట్టుకుపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నడవక 'ముందే' మూలకు..



- ఈ చిత్రంలో కనిపిస్తున్నది సీవరేజ్ జెట్టింగ్ కం సక్షన్ మిషన్. 2020లో ఇటలీ నుంచి రూ.45 లక్షలు వెచ్చించి తెప్పించారు. సదరు కంపెనీ వాహనానికి సంబంధించిన వారంటీ, గ్యారెంటీ, సర్వీస్ బుక్కును బల్దియా అధికారులకు ఇవ్వలేదని తెలిసింది. మరమ్మతు సమస్యతో ఏడాదికిపైగా మూలకే ఉంది. కావాల్సిన విడిభాగాలకు ఓ సంస్థ రూ. 4లక్షలకు పైగా ఖర్చు అవుతాయని కొటేషన్ ఇవ్వగా.. నిధుల మంజూరుకు ఆర్నెళ్ల క్రితం కౌన్సిల్ తీర్మానించింది కూడా. ఇప్పటికీ వాహనం మరమ్మతుకు నోచుకోవడంలేదు. ఈ వాహనం సేవలందించిందే తక్కువ.. పైగా మరమ్మతుతో ఎండకు ఎండుతూ.. వర్షానికి తడుస్తూ బల్దియా ప్రాంగణంలో మూలకు పడి ఉంది.



- ఈ చిత్రంలో కనిపిస్తున్న జేసీబీని రూ.24.26లక్షలు వెచ్చించి 2021లో బల్దియా కొనుగోలు చేసింది. వర్షాకాలంలో దీని ఉపయోగం చాలా ఉంటుంది. దీనికి మరమ్మతు రావడంతో మూడు నెలల క్రితం కరీంనగర్‌లోని ఓ వర్క్‌షాపునకు తరలించారు. మరమ్మతు పూర్తయినా బల్దియాకు తీసుకురాకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మరమ్మతుకు రూ.3.60లక్షలు ఖర్చయ్యింది. ఈ నిధులు మంజూరుకు అధికారులు కాలయాపన చేస్తున్నట్లు సమాచారం. ఈ వాహనం స్థానంలో రోజుకు రూ.10,400 చొప్పున అద్దె చెల్లిస్తూ.. ప్రైవేట్ జేసీబీలతో బల్దియాలో అత్యవసర పనులు నిర్వహిస్తున్నారు.



- ఈ వాహనం జెట్టింగ్ కం రాడ్ మిషన్. మ్యాన్‌హోళ్లలో నిండిన మురుగునీటిని సులువుగా తొలగించేందుకు దీనిని కొనుగోలు చేశారు. రెండేళ్ల క్రితం టీఎస్ ఆగ్రోస్ ద్వారా సుమారు రూ.30లక్షలు మంజూరు చేయగా.. రెండు నెలల క్రితం బల్దియాకు చేరింది. దీనికి సంబంధించిన వారంటీ, గ్యారెంటీ, సర్వీస్ బుక్‌ను ఏజెన్సీ బల్దియాకు అప్పగించలేదని అధికారులు అంటున్నారు. ఈ వాహనం సేవలందించిందే తక్కువ. సెన్సార్ ప్రాబ్లమ్‌తో పని చేయడం లేదు. మరమ్మతు చేయాల్సిన ఏజెన్సీ ప్రతినిధులు స్పందించడం లేదన్న ఆరోపణలొస్తున్నాయి. నగరంలో మురుగునీటి లీకేజీల సమస్యపై ప్రజల నుంచి ఫిర్యాదులు పెరిగిపోతున్నాయి.

- కొత్త వాహనానికి సెన్సార్ ప్రాబ్లమ్
- కరీంనగర్‌లోని వర్క్‌షాప్‌లో జేసీబీ
- విడిభాగాలు దొరక్క కదలని జెట్టింగ్ యంత్రం
- రూ.కోట్లు వెచ్చిస్తున్నా.. ఉపయోగం లేని వైనం
- కొరవడిన కార్పొరేషన్ అధికారుల పర్యవేక్షణ
- సమస్యలతో సతమతం అవుతున్న నగర ప్రజలు

సాక్షి ఫోకస్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలో పారిశుధ్య సమస్యలను తక్షణం పరిష్కరించాలనే లక్ష్యంతో పట్టణ ప్రగతి, 14వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.7.13 కోట్లతో టీఎస్ ఆగ్రోస్ సంస్థ ద్వారా పలు విలువైన అత్యాధునిక వాహనాలను 2021లో కొనుగోలు చేశారు. వీటిలో ప్రస్తుత వర్షాకాలంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై యుద్ధప్రాతిపదికన పరిష్కరించే వాహనాలు మూలకుపడ్డాయి. వర్షానికి తడుస్తూ.. ఎండకు ఎండుతూ తుప్పు పడుతున్నాయి. రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన అత్యాధునిక వాహనాలు అలంకార ప్రాయంగా మారుతున్నాయి. పాలకులు, అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో విలువైన వాహనాలు చెట్ల కింద నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. పాలకులు, అధికారులు స్పందించి విలువైన వాహనాలను వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పొంగి పొర్లుతున్న మ్యాన్‌హోళ్లు...

బల్దియాలోని పలు ప్రాంతాల్లోని మ్యాన్‌హోళ్ల లీకేజీ అవుతున్నాయి. మురుగుకాలువలు నిండి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. అసలే భారీ వర్షాలతో జనజీవనం అతలాకుతలం అవుతోంది. దీనికితోడు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలో మురుగునీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడడంతో మ్యాన్‌హోళ్లు నిండిపోయి మురుగునీరు పొంగి పొర్లుతోంది. స్థానిక మున్సిపల్ కూరగాయల మార్కెట్‌లోని చికెన్ విక్రయ దుకాణాల సమీపంలో ఓ మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు నెల రోజులకుపైగా లీకేజీ అవుతోంది. వర్షం నీటిలో కలిసి రోడ్డుపై ప్రవహిస్తోంది. అలాగే స్థానిక ప్రెస్‌క్లబ్ వెనక నివాసాల మధ్య మ్యాన్‌హోల్ లీకేజీతో మురుగునీరు ఇళ్ల ముందు ప్రవహిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు మురుగునీరు ఇళ్లల్లోకి చేరుతోంది. దీనిపై కాలనీవాసులు అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేశారు. కానీ జెట్టింగ్ కం రాడ్ మిషన్ వాహనం పని చేయకపోవడంతో ఇలాంటి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.



మురుగునీరు లీకేజీ అవుతున్న మ్యాన్‌హోల్

నేడు సదరం స్లాట్ బుకింగ్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో దివ్యాంగ వైద్య నిర్ధారణ పరీక్షలకు మంగళవారం మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని డీఆర్‌డీఓ శ్రీధర్ తెలిపారు. కొత్తగా కావాల్సిన, తాత్కాలికంగా ఉన్నవారు రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శారీరక వైకల్యం ఉన్నవారు ఈనెల 3, 17 తేదీల్లో నిర్వహించే స్లాట్ కోసం, దృష్టిలోపం ఉన్నవారు 10న, మానసిక వైకల్యం, బుద్ధిమాంద్యం ఉన్నవారు 14న, వినికిడిలోపం ఉన్నవారు ఈ నెల 24న జరిగే క్యాంపుల కోసం స్లాట్ బుక్‌చేసుకోవాలని సూచించారు.

క్రైస్తవ మైనార్టీల దరఖాస్తులకు 14 తుది గడువు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని అర్హతగల క్రైస్తవ మైనార్టీలకు ప్రభుత్వం అందించే రూ.లక్ష ఆర్థిక సాయానికి ఈనెల 14 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మొహమ్మద్ మెరాజ్ మహ్మద్ తెలిపారు. క్రైస్తవ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా పూర్తి సబ్సిడీపై ఆర్థికసాయం అందిస్తుందని, 21 నుంచి 55ఏళ్ల లోపు వయసుండి.. పట్టణప్రాంతాల్లో రూ.2లక్షలు, గ్రామీణప్రాంతాల్లో రూ.1.50లక్షల ఆదాయమున్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కార్పొరేషన్‌లో ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

కోల్‌సిటీ: నగరపాలక సంస్థ నుంచి డీఅండ్ఓ ట్రేడ్ లైసెన్స్ పొందడానికి ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ జి.సుచరణ్ తెలిపారు. ఇటీవల లైసెన్స్ తీసుకోవాలని అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్ నమ్మి మోసపోవద్దని కోరారు. లైసెన్స్ అవసరం ఉన్నవారు కార్పొరేషన్ శానిటేషన్ విభాగంలో నేరుగా లేదా సెల్ నంబర్ 63090 67393(శ్యాంసుందర్), 98669 62708 (నాగభూషణం), 96405 45663 (సునీల్‌కుమార్)ను నేరుగా సంప్రదించాలని సూచించారు. జరిమానా పెరుగుతూ పోయే అవకాశం ఉండడంతో వ్యాపారులు లైసెన్స్ కోసం త్వరపడాలని పేర్కొన్నారు.

పిల్లలూ.. బాగా చదవాలి

- టీచర్ చెప్పే పాఠాలు అర్థమవుతున్నాయా..?
- విద్యార్థులతో పాఠాలు చదివించిన కలెక్టర్
- ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు ఆదేశం
- జిల్లాకేంద్రంలోని ఎంపీపీఎస్ ఆకస్మిక సందర్శన



విద్యార్థులతో ముచ్చటిస్తూ.. వారి నుంచి సమాధానాలు రాబడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: 'టీచర్ చెప్పే పాఠాలు అర్థమవుతున్నాయా..? ఇంగ్లిష్, తెలుగు పాఠాలు చదవండి.. మీరంతా బాగా చదివి ప్రయోజకులు అవ్వాలి.. ప్రతిరోజూ పాఠశాల లైబ్రరీలోని పుస్తకాలు చదువుకుని జ్ఞానం పెంచుకోవాలి..' అని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ విద్యార్థులకు సూచించారు. జిల్లాకేంద్రంలోని ప్రగతినగర్‌లోగల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠ్యాంశాలకు సంబంధించి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల విషయ పరిజ్ఞానం, చదివే, రాసే సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో గదులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

హలో.. మీ పిల్లలు బడికి రావడం లేదేంటీ..

'హలో.. నేను కలెక్టర్‌ను మాట్లాడుతున్న. మీ ఇద్దరు పిల్లలు రోజు స్కూల్‌కు ఎందుకు రావడంలేదు..? వారిని ఇంటి దగ్గరే ఉంచి వారి భవిష్యత్తును పాడు చేయొద్దు..' అంటూ కలెక్టర్ విద్యార్థుల తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి కౌన్సెలింగ్ ఇచ్చారు. హాజరు తక్కువున్న వారి తల్లిదండ్రులకు ఫోన్ కలపాలని హెచ్‌ఎం రమాదేవిని ఆదేశించారు. ఉమేరా పేరెంట్స్‌తో మాట్లాడి పాఠశాలకు రెగ్యులర్‌గా పంపించాలని సూచించారు. పేరెంట్, టీచర్స్ మీటింగ్ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సర్కార్‌బడుల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచి ప్రజల్లో నమ్మకం పెంచాలన్నారు. ఉపాధ్యాయులు అనిత, రమ్య ఉన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ

పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గల ఈవీఎం మిషన్ల స్ట్రాంగ్ రూంను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈవీఎం గోదాం వద్ద ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని భద్రతాసిబ్బందికి సూచించారు. తాళం వేసి ఉన్న స్ట్రాంగ్ రూమ్ సీల్, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఈవీఎం గోదాం పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించాలని ఆదేశించారు. ఎలక్షన్ సూపరింటెండెంట్ బండి ప్రకాష్, పెద్దపల్లి తహసీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, టెక్నికల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అవే ఫిర్యాదులు పదేపదే రావొద్దు

- ప్రజావాణి సమస్యలపై సత్వరమే స్పందించాలి
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: ప్రజావాణికి ఒకసారి అందిన ఫిర్యాదు మరోసారి రావొద్దని, ఇందుకు ప్రతి శాఖ అధికారి ఆయా సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్లు శ్యాంప్రసాద్‌లాల్, ఆర్డీఓ మధుమోహన్‌తో కలిసి వినతులు స్వీకరించారు. తన భూమి కొనుగోలు చేసేందుకు మమత నుంచి రూ.3లక్షలు తీసుకున్నానని, తనకు మిగతాడబ్బులు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోకుండా ఇబ్బంది పెడుతోందని, ఆ భూమిని ఇతరులకు అమ్ముకునేందుకు అవకాశం ఇవ్వాలని రామగుండం మండలం అల్లూరుకు చెందిన రాజయ్య కలెక్టర్‌ను కోరారు. ఇలా జిల్లావ్యాప్తంగా బాధితులు తరలివచ్చి అధికారులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలో ఆర్టీసీ బస్‌డిపో ఏర్పాటు చేయాలని బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు రాజంమహంత, మేకల శ్రీనివాస్ తహసీల్దార్ వెంకటలక్ష్మికి సోమవారం వినతిపత్రం అందించారు. పెద్దపల్లిలో డిపో ఏర్పాటు చేయాలని, లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను అప్పగించాలని డిమాండ్ చేశారు. నాయకులు తిరుపతి, దిలీప్, శ్రీకాంత్, మంథెన కృష్ణ, గుడ్ల సతీశ్, వేణు, రాకేశ్, సోడా బాబు, వంశీ, ప్రదీప్, రఘుదీప్, సాగర్, శివయాదవ్ ఉన్నారు.

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్: పెద్దపల్లిలో బస్సు డిపో ఏర్పాటు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్ యాకన్నకు సోమవారం వినతిపత్రం అందజేశారు. బస్సుడిపో ఎన్నికల హామీగానే మిగిలిపోయిందన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం గది పూర్తయినా శవ పరీక్షలు చేయడం లేదన్నారు. భారీవర్షాలకు దెబ్బతిన్న రహదారులకు మరమ్మతు చేయాలని సూచించారు. నాయకులు గజబీంకర్ పవన్, బుర్ర సతీశ్‌గౌడ్, భూసారపు శ్రీనివాస్, ధరాడే శ్యామ్, సిరివేరి కొమురయ్య, గోస్కుల రవీందర్, కట్టగోని సాయిచరణ్, పోచంపల్లి ఈశ్వర్, శ్రీనివాస్, మహేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌లోడ్.. అధిక వేగం..!




శ్రీరాంపూర్ రహదారి మీదుగా వాహనాలు వెళ్తుండగా లేస్తున్న దుమ్ము

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌లోని శ్రీరాంపూర్ క్రాస్ రోడ్ నుంచి సుభాష్‌నగర్ వరకు వెళ్లే రహదారి చుట్టుపక్కల ప్రజలు దుమ్ముధూళితో ఇబ్బంది పడుతున్నారు. పలువురు శ్వాసకోశ సంబంధిత వ్యాధులబారిన పడుతున్నారు. ఇసుక రీచ్‌ల నుంచి వెళ్తున్న లారీలో ఓవర్ లోడ్‌తోపాటు అధిక వేగంతో వెళ్తుండడంతోనే సమస్యలు వస్తున్నాయని రోడ్డుకిరువైపులా ఉన్న షాపుల వ్యాపారులు పేర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి అక్కడక్కడ గుంతలు పడడంతో రాత్రివేళ ద్విచక్రవాహనదారులకు ఇబ్బంది కలుగుతోంది. మైనింగ్ అధికారులు రోడ్డును క్యూరింగ్ చేయాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు.

లారీలతోనే సమస్య

సుల్తానాబాద్‌తోపాటు ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల మీదుగా ప్రవహించే మానేరు వాగు నుంచి ఇసుకను లారీల ద్వారా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు లారీల్లో ఓవర్‌లోడ్‌తో ఇసుకను తరలించడం ద్వారా రహదారులు గుంతలమయంగా మారుతున్నాయి. తద్వారా ప్రమాదాలకు దారితీస్తున్నట్లు వాహనదారుల ఆరోపిస్తున్నారు. ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతున్నా.. రోడ్లకు మరమ్మతు చేయకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సుల్తానాబాద్ మండలకేంద్రంలోని స్వప్నకాలనీ, పూసలరోడ్డు, సుగ్లాంపల్లితోపాటు పలు ప్రాంతాలన్నీ గుంతలమయంగా మారాయి. లారీల కారణంగా దుమ్ము లేచి ఇబ్బంది పడుతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. దీనిపై మైనింగ్ అధికారిని వివరణ కోరగా.. వర్షాలు తగ్గాక మరమ్మతు చేయిస్తామని వివరించారు.


దుమ్ముతో నిండిపోతోంది



భారీ వాహనాలు వెళ్లడం ద్వారా దుమ్ము, ధూళి లేస్తోంది. వ్యాపారులు శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారు. వర్షానికి పలు ప్రాంతాల్లో రోడ్లు దెబ్బ తిన్నాయి. మరమ్మతు చేయకపోవడంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

– నోముల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు

శుభ్రం చేయించాలి



ఇసుక రీచ్ దక్కించుకున్న వారు రోడ్డుపై నిత్యం వాటర్ చల్లించాలి. లేకుంటే పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించాలి. లారీలు ఇతర వాహనాలు రోడ్డుపై వెళ్లడం ద్వారా సమస్యలు ఉత్పన్నమైనా మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడం సరికాదు.

– కామని రాజేంద్రప్రసాద్, బీజేపీ నాయకుడు

సమీకృత వ్యవసాయంతో మేలు



రైతులతో సమావేశమైన ప్రతినిధులు

రామగుండం: సమీకృత వ్యవసాయంతో రైతులు మెరుగైన ఫలితాలు సాధించే అవకాశముందని, ఇందుకు నాబార్డు, ఎన్టీపీసీ సంస్థలు ఆర్థికంగా ప్రోత్సహిస్తాయని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. అంతర్గాం మండలకేంద్రంలోని రైతు భవన్‌లో నాబార్డు, ఎన్టీపీసీ సంస్థ ప్రతినిధులు రైతులతో సోమవారం సమావేశమయ్యారు. సమీకృత వ్యవసాయ విధానాలపై నాబార్డు డీజీఎం శ్రీనివాస్ మాట్లాడారు. ఇప్పటివరకు రైతులు సాగు చేసిన పంటల వివరాలు, సాగు విధానంలో అనుసరించిన పద్ధతులు తదితర అంశాలను తెలుసుకున్నారు. ఫాంపాండ్స్, పండ్ల మొక్కలు, జామ, అరటి, బొప్పాయి, మునగ మొక్కల పెంపకం, చేపపిల్లల పెంపకం చేపట్టినట్లు రైతులు వివరించారు. వీరిని త్వరలోనే స్టడీ టూర్‌కు తీసుకెళ్తామని అధికారులు పేర్కొన్నారు. అంతర్గాం మండల వ్యవసాయాధికారి బూక్య రాంబాబు, నాబార్డు కరీంనగర్ జిల్లా ప్రతినిధులు డీడీఎంలు జయప్రకాశ్, మనోహర్‌రెడ్డి, ప్రోగ్రాం మేనేజర్ నరసింహాచారి, కో–ఆర్డినేటర్ యాదగిరి, మొబిలైజర్ రాజు పాల్గొన్నారు.



ప్రకృతి మధ్య కనువిందుగా..

ఎన్నిసార్లు చూసినా మళ్లీమళ్లీ చూడాలనిపించే ప్రకృతి అందాల మధ్య కూ... అంటూ కూత పెడుతూ రైళ్లు పరుగులు తీస్తూ కనువిందు చేస్తున్నాయి. వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో ప్రకృతి పచ్చదనంతో నిండిపోయింది. బసంత్‌నగర్ మీదుగా రైళ్లు ఇలా పరుగు తీస్తూ 'సాక్షి కెమెరా'కు కనిపించాయి.– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



క్లుప్తంగా

కలెక్టర్ సన్మానించిన మాజీ సైనికులు



కలెక్టర్‌ను సన్మానిస్తున్న మాజీ సైనికులు

గోదావరిఖని: కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలెక్టరేట్‌లో మాజీ సైనికులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గంగరాజు, ఉపాధ్యక్షుడు ఇ.శ్రీనివాస్, శివసాగర్, సతీశ్, భాస్కర్, ఎస్‌కె.నజీబ్, ఎం.అశోక్, సయ్యద్, కాశయ్య, బాసుదేవ్‌షా, రవి, నరసింహ, శివప్రకాష్, అబ్దుల్‌వార్ తదితరులున్నారు.

జాతీయ చేనేత ఐక్య వేదిక అధికార ప్రతినిధిగా అక్షిత



అక్షిత

సప్తగిరికాలనీ(కరీంనగర్): జాతీయ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధికార ప్రతినిధిగా కరీంనగర్‌కు చెందిన డాక్టర్ అక్షితను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కష్టపడేవారికి సరైన గుర్తింపు ఉంటుందని, సంఘం బలోపేతానికి పాటుపడుతున్న కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు అక్షిత సేవలను మరింతగా వినియోగించుకునేందుకు రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్, రాష్ట్ర ఇన్‌చార్జి కాటా రాందాస్, అధ్యక్షుడు మాడ రాజా, గౌరవ అధ్యక్షులు తిరందాస్ వేణుగోపాల్, కోట దామోదర్, యువజన విభాగం అధ్యక్షుడు రామకృష్ణ, మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు సుజాతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ప్రైవేటు సెక్యూరిటీకి రక్షణ కరువు



కమాన్‌పూర్: ఆర్జీ–3 డివిజన్ పరిధిలో ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందికి రక్షణ కరువైందని ఐఎన్‌టీయూసీ రామగిరి మండల శాఖ అధ్యక్షుడు ఉడత శంకర్ ఆరోపించారు. సెంటినరీకాలనీలోని సిబ్బంది కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వహించే పని స్థలాల వద్ద రాత్రివేళల్లో లైటింగ్, షెల్టర్, కూర్చునేందుకు కుర్చీలు సమకూర్చడం లేదన్నారు. వారికి నెలకు నాలుగు రోజులు డ్యూటీ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. సెక్యూరిటీ సిబ్బందికి సింగరేణి యాజమాన్యం అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు బండ కృష్ణారెడ్డి, పిట్టల లక్ష్మణ్, చంద్రశేఖర్, సారయ్య, శ్రీనివాస్, సంజీవ్, రవి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న వ్యక్తి అరెస్టు?

కరీంనగర్ క్రైం: నగరంలో నకిలీ సర్టిఫికేట్లు తయారు చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిసింది. కరీంనగర్‌కు చెందిన వ్యక్తి బోయవాడ సమీపంలోని ఓ పాఠశాలకు చెందిన స్టడీ, ఇతర సర్టిఫికెట్లు ఇస్తున్నాడని పోలీసులకు తెలిసినట్లు సమాచారం. దీనిపై వారు నిఘా పెట్టి, అతన్ని అరెస్టు చేసినట్లు తెలిసింది.

విజృంభిస్తున్న ‘కళ్ల కలక’

- జిల్లాలో పెరుగుతున్న బాధితులు
- ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తున్న వ్యాధి
- జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు



గోదావరిఖని: జిల్లాలో కళ్ల కలక(కంజెక్టివిటీస్) వ్యాధి విజృంభిస్తోంది. వర్షాలు తగ్గిన తర్వాత సీజనల్ వ్యాధుల తోపాటు దీని ప్రభావం కూడా ఎక్కువగా కనిపిస్తోంది. ఇప్పటికే చాలా మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారు. ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాప్తి చెందుతోంది. కళ్లు ఎర్రగా మారడం, కంటి నుంచి నీరు కారడం, దురద, కంటి నొప్పి, కంటి రెప్పలు అతుక్కుపోవడం, వాపు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

చిన్న పిల్లలు, విద్యార్థుల్లోనే ఎక్కువ..

- చిన్న పిల్లలు, విద్యార్థుల్లోనే కళ్ల కలక వ్యాధి ఎక్కువగా వస్తోంది. దుమ్ము, ధూళితో వ్యాప్తి చెందుతుందని వైద్యులు అంటున్నారు. గడిచిన నాలుగైదేళ్లలో దీని వ్యాప్తి కనిపించలేదు. చిన్న పిల్లలకు వస్తే అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. బ్యాక్టీరియా ద్వారా వస్తే ఐదారు రోజులు, వైరస్ వల్ల వస్తే రెండు వారాల వరకు ఇబ్బంది పెడుతుందని పేర్కొంటున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే..

- కళ్ల కలక ఇంట్లో ఒకరికి వస్తే మిగతావారికి వ్యాపించే అవకాశం ఉంటుంది.
- వ్యాధి వచ్చినవారు ఇంట్లో నుంచి బయటకు వెళ్లకపోవడం మంచిది.
- బాధితుల వస్తువులను తాకడం, వాడటం చేయవద్దు.
- కంటి నుంచి కారే నీటిని టిష్యూ పేపర్‌తో తుడుచుకోవాలి.
- తప్పనిసరి పరిస్థితుల్లో ముట్టుకుంటే చేతులను శుభ్రం చేసుకోవాలి.
- కళ్లద్దాలు పెట్టుకుంటే ఉపశమనంతోపాటు ఇతరులకు వ్యాపించకుండా ఉంటుంది.
- వ్యాధి నివారణకు యాంటీ బయోటిక్స్, ఐ డ్రాప్స్ వాడాలి.

ఆందోళన అవసరం లేదు

వాతావరణ మార్పుల కారణంగా కళ్ల కలక వ్యాధి వస్తుంది. వైరల్, బ్యాక్టీరియా, ఎలర్జిటిక్ కంజెక్టివిటీస్ అంటూ మూడు రకాలు ఉంటాయి. ప్రస్తుతం వైరస్ ద్వారానే ఎక్కువ మందికి వస్తోంది. వ్యాధి వచ్చినవారు తమ కళ్లను ఎప్పటికప్పుడు నీటితో శుభ్రం చేసుకుంటూ ఉండాలి. కంటికి చలువచేసే లూబ్రికేటింగ్ డ్రాప్స్ ఎక్కువగా వాడాలి. ప్రతిరోజు పది కేసులు నమోదవుతున్నాయి. ఎక్కువగా 15 ఏళ్లలోపువారే ఉంటున్నారు.

– డాక్టర్ ఆర్.భవ్య, ప్రభుత్వ కంటి వైద్య నిపుణురాలు

గీతకార్మికులకూ సాయం చేయాలి



ఓదెలలో ర్యాలీ తీస్తున్న గీత కార్మికులు

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట మోకుదెబ్బ, గౌడసంఘం నిరసన

ఓదెల: బీసీల్లోని కులవృత్తి దారులకు రూ.లక్ష సాయానికి ముందుకొచ్చిన ప్రభుత్వం.. అందులో గీత కార్మికులను చేర్చాలని మండల కేంద్రంలో గౌడసంఘం, మోకుదెబ్బ రాష్ట్ర నాయకులు ఏగోలపు సదయ్యగౌడ్, అంజిగౌడ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి 200 మంది గీతకార్మికులు తరలివచ్చి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రెండు సంఘాల నాయకులు వేగోలంశంకర్‌గౌడ్, నల్లగోని వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుడి పట్టివేత



టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో నిందితుడు

గోదావరిఖని: స్థానిక చంద్రశేఖర్‌నగర్‌లో మట్కా నిర్వాహకుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఆదేశాల మేరకు రంగంలో దిగిన పోలీసులు సోమవారం నాగ అక్షయ్ ఇంటిపై దాడి చేశారు. రూ.4,640, రెండు బుక్కులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని, అతన్ని అదుపులోకి తీసుకున్నారు. తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని చెబుతూ ఏడాదిగా పలువురితో మట్కా నిర్వహిస్తున్నట్లు ఒప్పుకున్నాడని పేర్కొన్నారు. నిందితుడిని గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్, సిబ్బంది ఉన్నారు.

ప్రశ్నించిన వారిని ఆదర్శంగా తీసుకోండి

- జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు

మంథని: మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుతో ఈ ప్రాంతానికిగానీ.. రైతులకుగానీ ఎలాంటి మేలు జరగలేదని, మండలంలోని నాగేపల్లికి పంటల పరిశీలనకు వెళ్లిన ఎమ్మెల్యేను ప్రశ్నించిన రైతులు కాపిరపు శ్రీనివాస్, తోటపల్లి రాజయ్యను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. సోమవారం మంథనిలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ‘ప్రభుత్వంలో లేను.. నేను ఒక్కడినే ఎమ్మెల్యే..’ అంటూ శ్రీధర్‌బాబు రైతులకు సమాధానం ఇచ్చారని, దీనికి రైతులు ‘సర్ మిమ్మల్ని ఎమ్మెల్యేగా మేం గెలిపించుకుటంగానీ రాష్ట్రంలోని మిగిలిన 118 మందిని గెలిపించుకోలేం కదా.. మాకు అంతమందికి ఓటు వేసే హక్కు రాజ్యాంగంలో ఇవ్వలేదు..’ అని ప్రశ్నించడం గొప్ప ఆలోచన అన్నారు. ప్రభుత్వంలోలేనని చెప్పిన ఎమ్మెల్యే ఉన్నప్పుడు ఏం చేసారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఒకే కుటుంబం చాలాకాలం పాలించినా.. ఈ ప్రాంత ప్రజలకు ఏమీ చేయలేదని, మాయమాటలతో కాలం వెళ్లదీసిందని పేర్కొన్నారు. ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకుంటున్న శ్రీధర్‌బాబు నిజస్వరూపం తెలియజేయడం కోసమే తన ఆరాటమన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

సుల్తానాబాద్ రూరల్: సుల్తానాబాద్ మండలంలోని రేగడిమద్దికుంటకు చెందిన బోడ మల్లారెడ్డి(85) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై విజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారెడ్డికి గతేడాది పక్షపాతం రావడంతో కాళ్లుచేతులు పని చేయడం లేదు. దీంతో మనస్తాపానికి గురై, ఈ నెల 24న ఇంట్లో ఎవరూలేని సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. అపస్మారక స్థితితో ఉన్న మల్లారెడ్డిని కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం చనిపోయాడు. మృతుడి కుమారుడు తిరుపతిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జూనియర్ లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలు

- పరిస్థితి విషమం

ఓదెల: విద్యుదాఘాతంతో ఓదెల మండలంలోని కొలనూర్ గ్రామానికి చెందిన జూనియర్ లైన్‌మెన్ షారుఖ్‌కు తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. సోమవారం కొలనూర్ శివారులో మడిపల్లి వద్ద స్తంభం ఎక్కి పని చేస్తుండగా విద్యుత్ సరఫరా జరగడంతో ఆయన కిందపడ్డాడని చెప్పారు. కాలు విరిగి, శరీరం కొంత భాగం కాలడంతో కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారన్నారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తీసుకెళ్లినట్లు ఏఈఈ మోహన్‌నాయక్ పేర్కొన్నారు.

అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వాలి



కనగర్తిలో మాట్లాడుతున్న సీఐ జగదీష్

ఓదెల: గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సుల్తానాబాద్ సీఐ జగదీష్ తెలిపారు. సోమవారం మండలంలోని కనగర్తిలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. యువత చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని, చెడు అలవాట్లకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సర్పంచు కోట దామోదర్‌రెడ్డి, ఎస్సైలు శ్రీధర్, శ్రీనివాస్, వెంకటకృష్ణ, వినిత పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



రాజమల్లు మృతదేహం

ఓదెల: ఓదెల గ్రామానికి చెందిన వంగ రాజమల్లు(59) అనే రైతు విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. పొత్కపల్లి ఎస్సై శ్రీధర్ కథనం ప్రకారం.. రాజమల్లు నాలుగు ఎకరాల్లో వరి పంట సాగు చేశాడు. పొలం పనుల నిమిత్తం సోమవారం ఒడ్డు పైనుంచి నడుస్తుండగా కాలుజారడంతో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగకు తగిలాడు. దీంతో విద్యుదాఘాతం సంభవించి, అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య కుమారి, కుమారుడు ఉన్నారు. మృతుడి కుమారుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నందిమేడారంలో చేపల పంచాయితీ

- పరస్పరం దాడి చేసుకున్న గంగపుత్రులు, ముదిరాజ్‌లు

ధర్మారం: మండలంలోని నందిమేడారం రిజర్వాయర్‌లో చేపల పంచాయితీ చిలికి చిలికి గాలివానలా తయారైంది. ఇరువర్గాలు పరస్పర దాడికి పాల్పడి, పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లారు. వివరాలిలా ఉన్నాయి.. నందిమేడారం గ్రామానికి చెందిన గంగపుత్రులు, ముదిరాజ్‌లు మత్స్యకార్మిక సహకార సంఘంలో సభ్యత్వం కలిగి ఉన్నారు. దీని ప్రకారం వాటాలుగా చేసుకొని, ఏటా చేపలు పట్టుకొని, ఉపాధి పొందుతున్నారు. అయితే స్థానిక చెరువును ప్రభుత్వం రిజర్వాయర్‌గా మార్చింది. అయినా ఈ రెండు కులాలవారు పాత పద్ధతిలోనే చేపలు పట్టుకుంటున్నారు. ఈ క్రమంలో గత ఆదివారం నందిమేడారంలో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించి, రిజర్వాయర్‌లో చేపలు పట్టకూడదని తీర్మానం చేశారు. దీన్ని గంగపుత్రులు వ్యతిరేకించారు. అంతేకాకుండా వారు అదేరోజు రాత్రి రిజర్వాయర్‌లో చేపల కోసం వలలు వేశారు. సమాచారం అందుకున్న ముదిరాజ్‌లు సోమవారం ఉదయం రిజర్వాయర్ వద్దకు వెళ్లి, వలలు ఎందుకు వేశారని వారితో వాగ్వాదానికి దిగారు. రెండు వర్గాల వారు దాడి చేసుకోగా పలువురికి గాయాలయ్యాయి. ఇరువర్గాల వారు ధర్మారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఎస్సై సత్యనారాయణ పలు దఫాలుగా ఇరువర్గాలతో చర్చించారు. సమాచారం అందుకున్న పెద్దపల్లి సీఐ అనిల్ సాయంత్రం స్టేషన్‌కు చేరుకొని, వారితో మాట్లాడారు. ఈ విషయమై మత్స్యశాఖ ఉన్నతాధికారితో మాట్లాడి, వివరాలు సేకరించారు. అనంతరం చేపల కోసం ఎవరూ రిజర్వాయర్‌లోకి వెళ్లవద్దని సూచించారు. త్వరలోనే ఇరువర్గాలకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

జవాబుదారీతనం కోసమే ‘ఉపాధి’ తనిఖీ

- 16 గ్రామాల్లో కూలీలకు రూ.74 కోట్లు చెల్లింపు
- డీఆర్‌డీవో శ్రీధర్
- అంతర్గాం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక



పనుల వివరాలు తెలుసుకుంటున్న డీఆర్‌డీవో శ్రీధర్

రామగుండం: ప్రజలకు జవాబుదారీతనం కోసమే ఉపాధిహామీ పనుల్లో సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వి.శ్రీధర్ అన్నారు. అంతర్గాం మండలంలోని 16 గ్రామాల్లో గడిచిన మూడేళ్లలో చేపట్టిన ఉపాధి పనులకు గానూ కూలీలకు రూ.74.84 కోట్లను వేతనాల రూపంలో చెల్లించామని తెలిపారు. సోమవారం అంతర్గాం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. చేపట్టిన పనుల వివరాలను రిసోర్స్‌పర్సన్లను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలవారీగా జరిగిన నష్టాన్ని గుర్తించి, సంబంధిత టెక్నికల్ అసిస్టెంట్లు, జూనియర్ ఇంజినీర్ల నుంచి రికవరీకి ఆదేశించారు. గ్రామాల్లో నాటిన మొక్కల్లో అత్యధికం చనిపోయినట్లు గుర్తించారు. పలు పల్లెల్లో ఎస్సారెస్పీ స్థలాలకు హద్దులు నిర్ణయించకపోవడంతో నాటిన మొక్కలను రైతులు తొలగించారని ఫీల్డ్ అసిస్టెంట్లు తెలిపారు. పెద్దంపేట నుంచి రూ.2 వేలు, రాయదండి రూ.3,372, మద్దిర్యాల రూ.1,008, ఎగ్లాస్‌పూర్ రూ.15,055, అంతర్గాం రూ.1,101, ఆకెనపల్లి రూ.5,255, ఎల్లంపల్లి రూ.4,675, బ్రాహ్మణపల్లి రూ.5,103, సోమనపల్లి రూ.2,764, పొట్యాల రూ.14,400, విసంపేట రూ.4,676, ముర్మూర్ రూ.544, టీటీఎస్ అంతర్గాం రూ.1,470, లింగాపూర్ నుంచి రూ.2 వేల రికవరీకి డీఆర్‌డీవో ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ దుర్గం విజయ, జెడ్పీటీసీ సభ్యుడు ఆముల నారాయణ, ఎంపీడీవో యాదగిరి, ఏపీవో కొమురయ్య, అంబుడ్స్‌మెన్ శరత్‌రావు, క్వాలిటీ కంట్రోల్ అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యువత సత్ప్రవర్తనతో మెలగాలి

- ఏసీపీ మహేశ్
- బందంపల్లిలో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం



గ్రామస్తులకు సూచనలిస్తున్న ఏసీపీ మహేశ్

పెద్దపల్లిరూరల్: యువత సత్ప్రవర్తనతో మెలిగి, తమ భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్ అన్నారు. పెద్దపల్లి పట్టణ శివారులోని బందంపల్లిలో సీఐ అనిల్‌కుమార్, ఎస్సై మహేందర్‌లతో కలిసి సోమవారం కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాంలో గ్రామస్తులతో సమావేశమయ్యారు. సైబర్ నేరాలు, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సరైన ధ్రువపత్రాలు లేని 40 బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తుల సమాచారం ఇవ్వాలని కోరారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. వీధుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకువస్తే తమవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదాన శిబిరంలో రక్తదానం చేసేందుకు 25 మంది యువకులు ముందుకురావడంతో వారిని ఏసీపీ అభినందించారు. ఎస్సైలు మల్లేశ్, సత్యనారాయణ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఉద్యోగ విరమణ పొందినవారికి సన్మానం



పీవీ రమణను సన్మానిస్తున్న జీఎం మనోహర్



జనార్దన్ రెడ్డిని సన్మానిస్తున్న రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియా సీనియర్ సెక్యూరిటీ అధికారిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన పీవీ రమణను సోమవారం ఘనంగా సన్మానించారు. ఆర్జీ–2 జీఎం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం మనోహర్ ఆయనను శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఏరియా ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, ప్రాజెక్టు అధికారి మధుసూదన్, ఎస్‌వోటూ జీఎం సలీం, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, సివిల్ డీజీఎం ధనుంజయ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆర్జీ–1 ఏరియాలో ఫైనాన్స్ ఏజీఎంగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన రామకృష్ణను జీఎం చింతల శ్రీనివాస్ సన్మానించారు. మరో కార్యక్రమంలో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన చంద్రమౌళి, యాకయ్యలను సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి సత్కరించారు. అలాగే ఓసీపీ–3లో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన డ్రిల్ ఆపరేటర్ జనార్దన్‌రెడ్డి, జి.సత్యనారాయణ, వర్క్‌షాప్‌కు సంబంధించి శ్రీనివాస్ తదితరులను సన్మానించారు.

డీసీసీ అధ్యక్షుడు, సీఐ..

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ఆర్జీ–2 ఏరియాలో 38 ఏళ్లు డ్రిల్ ఆపరేటర్‌గా సేవలందించి, ఉద్యోగ విరమణ పొందిన కరివేద జనార్దన్ రెడ్డి–భాగ్యలక్ష్మి దంపతులను సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్ సింగ్ రాజ్‌ఠాగూర్ సన్మానించారు. అలాగే ఆర్జీ–2 ఏరియా సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రమణ ఉద్యోగ విరమణ పొందగా గోదావరిఖని టూటౌన్ రెండో సీఐ అఫ్జలొద్దీన్ ఆయనను శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ నాయకులు రాజిరెడ్డి, స్వామి, రాజేశ్, సదానందం, చక్రపాణి, రాజు, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులకు మద్దతు



మాట్లాడుతున్న పౌర హక్కుల నాయకులు

జ్యోతినగర్: వేతన ఒప్పందం కోసం ఉద్యమిస్తున్న ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మిక సంఘాలకు, కార్మికులకు తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్ తెలిపారు. సోమవారం ప్రాజెక్టు లేబర్ గేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం పోరాడేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులను శ్రమదోపిడీకి గురిచేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వాలు కనీస వేతనాల జీవోలను విడుదల చేయాలని, ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులకు బీ–గ్రేడ్ వేతనాల చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర సహాయక కార్యదర్శి మాదన కుమారస్వామి, ఉపాధ్యక్షురాలు పుల్ల సుచరిత, సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి రవి, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర మహాసభలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో గోదావరిఖనిలో ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహించనున్న కేంద్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ కేంద్ర కమిటీ వైస్ ప్రెసిడెంట్ ఎల్.ప్రకాశ్, బ్రాంచి కార్యదర్శి రాజరత్నం పిలుపునిచ్చారు. సోమవారం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 శావల్ అండ్ డ్రిల్స్ సెక్షన్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అంతకుముందు ఆర్జీ–2 ఏరియాలో 16న బ్రాంచి మహాసభలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని మైన్స్ విభాగాల్లో నూతన కమిటీలను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. శావల్ అండ్ డ్రిల్స్ సెక్షన్ ఇన్‌చార్జిగా తొట్టం రాజసాగర్, అసిస్టెంట్ ఇన్‌చార్జిగా మల్లేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రామ్ పండిట్ బాబు, వెంకటేశ్‌లను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు అన్నారావు, శ్యాంసన్, రాజయ్య, రవికుమార్, రవీందర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్లు నరికిన వారిపై చర్య తీసుకోండి

సుల్తానాబాద్: తాటిచెట్లు నరికిన వారిపై చర్య తీసుకోవాలని గీత పారిశ్రామిక సహకార సంఘం గర్రెపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు తాళ్లపల్లి రాజయ్య కోరారు. సోమవారం సంఘం సభ్యులతో ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి వెళ్లి, ఫిర్యాదు చేశారు. సాంబయ్యపల్లికి చెందిన పలువురు రైతులు తాటిచెట్లను తమకు తెలియకుండా, అనుమతి లేకుండా నరికివేశారని ఆరోపించారు. విచారణ జరిపి, చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ ఆనందరావు పేర్కొన్నారు. సభ్యులు పులి లచ్చయ్య, మార్క కొమురెల్లి, కేక్కర్ల కొమురెల్లి, మూల పర్శరాములు జాగిరి తిరుపతి, పడాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలే..

సుల్తానాబాద్ రూరల్: గీత కార్మికులకు తాటి, ఈతచెట్లే జీవనాధారమని, వాటిని అక్రమంగా నరికివేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గతంలో ఫిర్యాదు చేసినా ఎక్సైజ్ పోలీసులు పట్టించుకోలేదని గౌడ సంఘం గర్రెపల్లి నాయకులు ఆరోపించారు. గర్రెపల్లి రెవెన్యూ, సాంబయ్యపల్లి పంచాయతీ పరిధిలో కొందరు తాటిచెట్ల రెండు రోజుల క్రితం నరికివేయగా బాధ్యులపై చర్య తీసుకోవాలని సోమవారం సుల్తానాబాద్ పట్టణంలోని ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘం అధ్యక్షుడు రాజయ్యగౌడ్, సభ్యులు తదితరులున్నారు.